

పాలీసెట్ తుది కౌన్సెలింగ్‌లో ఆప్షన్ల మార్పునకు అవకాశం

ఎచ్చెర్ల, జూలై 13: పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహిస్తున్న ఏపీ పాలీసెట్-2024 తుదివిడత కౌన్సెలింగ్ ప్రక్రియ శనివారంతో ముగిసింది. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల (శ్రీకాకుళం)లోని హెల్ప్‌లైన్ కేంద్రంలో ఈ నెల 11 నుంచి 13వ తేదీ కౌన్సెలింగ్ జరిగింది. చివరి రోజు 25మంది అభ్యర్థులు కౌన్సెలింగ్ ప్రక్రియకు హాజరయ్యారు. తుది కౌన్సెలింగ్‌కు హాజరైన అభ్యర్థులు ఆదివారం ఆప్షన్లు మార్చుకునే వీలుంది.

ఇదేంటి తమ్మినేని సార్!



తమ్మినేని సీతారాం

- గత స్పీకర్ ఇంటి పనులకు మునిసిపల్ ఉద్యోగులు
- 12 మంది సిబ్బంది వినియోగం
- ఐదేళ్లలో రూ.1.2 కోట్లు దుర్వినియోగం
- అక్రమాలు వెలికితీసిన ఎమ్మెల్యే కూన రవి
- ఇటీవల సమీక్షలో అధికారులకు నిలదీత



నిధుల దుర్వినియోగంపై అధికారులను ప్రశ్నిస్తున్న ఎమ్మెల్యే కూన రవికుమార్(ఫైల్)

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

వైసీపీ పాలనలో అక్రమాలు ఏరీతిన జరిగాయన్నదీ ప్రజలందరికీ తెలిసిందే. కానీ పెద్ద నేతలు చేసిన అవినీతి ఇప్పుడిప్పుడే బయటపడుతోంది. మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం అక్రమాల బాగోతాన్ని.. ఆయన మేనల్లుడు, ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ ఒక్కొటీ వెలుగులోకి తెస్తున్నారు. ప్రధానంగా ఆమదాలవలస మునిసిపాలిటీలో 12 మంది సిబ్బందిని.. తమ్మినేని తన ఇంటి పనుల నిర్వహణకు వినియోగిస్తూ ప్రభుత్వ నిధులు దుర్వినియోగం చేశారని ఆరోపిస్తున్నారు. దీనిపై సమాధానం చెప్పాలంటూ.. ఇటీవల సమీక్షలో అధికారులను నిలదీయగా.. వారు నోరు మెదపకపోవడం చర్చనీయాంశమైంది. 2019 ఎన్నికల్లో వైసీపీ తరఫున ఆమదాలవలస బరిలో నిలిచి ఎమ్మెల్యేగా గెలిచిన తమ్మినేని సీతారామ్‌కు.. అప్పటి సీఎం జగన్ స్పీకర్ పదవి కట్టబెట్టారు. స్పీకర్‌గా కంటే.. తాను ముందుగా 'ఆమదాలవలస' ఎమ్మెల్యేనే అంటూ తనకుతానుగా అధికారుల్లోనూ, ప్రజల్లోనూ ఐదేళ్లు తమ్మినేని పలుచనైపోయారు. మరోవైపు స్పీకర్ పదవిని అడ్డం పెట్టుకుని.. అక్రమాలకు పాల్పడ్డారు. స్పీకర్‌గా వ్యవహరిస్తూ.. ఆమదాలవలస మునిసిపల్ సిబ్బందిని తన ఇంటిపనికి వినియోగించుకున్నారన్నది ఇప్పుడు తేటతెల్లమైంది. ఇటీవల ఆమదాలవలస మునిసిపాలిటీలో నిర్వహించిన సమీక్షలో ఎమ్మెల్యే కూన రవి ఈ విషయాన్ని బయటకు తీశారు. ప్రభుత్వ ఉత్తర్వులు లేకుండా ఐదేళ్ల పాటు మునిసిపల్ సిబ్బందిని స్పీకర్ ఎలా వినియోగించుకున్నారని కూపీ లాగారు.

● అప్పట్లో కోడెలపై నానాయాగీ.. ఇప్పుడేమంటారో..

2014 నుంచి 2019 వరకు టీడీపీ హయాంలో స్పీకర్‌గా బాధ్యతలు నిర్వహించిన కోడెల శివప్రసాద్‌పై.. వైసీపీ అధికారంలోకి రాగానే నానాయాగీ చేసింది. ఫర్నీచర్ తీసుకువెళ్లాలని లేఖ ఇచ్చినప్పటికీ మాజీస్పీకర్ కోడెల శివప్రసాద్‌పై కేసు నమోదుచేసి.. ఆయన వ్యక్తిత్వాన్నే హననం చేసేలా వైసీపీ ప్రభుత్వం వికృతంగా వ్యవహరించింది. కాగా.. 2019 నుంచి ఈ ఏడాది మే వరకు స్పీకర్‌గా ఉన్న తమ్మినేని ఇంటి పనికి.. ఆయన వ్యాపార కలాపాలకు మునిసిపల్ సిబ్బందిని వినియోగించుకోవడం..

● వేతనం అక్కడ.. పనులు ఇక్కడ

ఆమదాలవలస మునిసిపాలిటీలో 80మంది పారిశుధ్య కార్మికులు ఉన్నారు. ఇందులో 71 మంది ఒప్పంద ప్రాతిపదికన కాగా.. 9 మంది రెగ్యులర్ ఉద్యోగులు. గత ఐదేళ్లు స్పీకర్ తమ్మినేని తన ఇంటి పనుల నిర్వహణకు 12మంది మునిసిపల్ సిబ్బందిని వినియోగించుకున్నారు. తమ్మినేనికి చెందిన పెట్రోల్ బంకులోనూ, టీఎస్ఆర్ కళాశాల కారులకు డ్రైవర్లుగానూ, గృహావసరాలకు వారిని వాడుకున్నారు. ఆ 12 మందికి ఐదేళ్లలో గత ప్రభుత్వం నుంచి రూ.1.20 కోట్లు వేతనాలుగా చెల్లించి.. స్పీకర్ సొంత అవసరాలకు వారిని వినియోగించుకున్నారు. ప్రభుత్వ నిధులు దుర్వినియోగం చేశారు. అప్పటి మునిసిపల్ అధికారులు కూడా స్వామి భక్తి చాటుకుని.. ఇష్టమొచ్చినట్లుగా స్పీకర్ ఇంటిపనికి సిబ్బందిని కేటాయించేశారు. ప్రస్తుతం ఎమ్మెల్యే కూన రవికుమార్ అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇవ్వలేని స్థితిలో ఉన్నారు.

ఆయన కోసం పనిచేసిన సిబ్బందికి ప్రభుత్వం నుంచి రూ.1.2కోట్లు జీతాల రూపంలో వెచ్చించడంపై ఇప్పుడు దుమారం రేగింది. తమ్మినేని అక్రమాల ఉదంతంపై దర్యాప్తు చేస్తారా? లేదోనన్నది చర్చనీయాంశమవుతోంది. ఎన్డీయే కూటమి కొలువుదీరిన తర్వాత తొలి సమీక్షలోనే ఈ అక్రమాలను ఎమ్మెల్యే కూన రవికుమార్ వెలుగులోకి తీశారు. ఇంకా లోతుగా దర్యాప్తు చేస్తే మరిన్ని అక్రమాలు బయటపడతాయని జిల్లావాసులు అభిప్రాయపడుతున్నారు. గత ఐదేళ్లలో టీడీపీ నేత కూన రవిపై రౌడీషీటర్ తెరవడంతోపాటు కుప్పలుగా అక్రమ కేసులను తమ్మినేని పరోక్షంగా నమోదు చేయించారని ఆరోపిస్తున్నారు. ఇప్పుడు సీన్ రివర్స్ అయిందని పేర్కొంటున్నారు. గత ఐదేళ్ల అక్రమాలపై వైసీపీ పెద్దలు ఏమి సమాధానం చెబుతారోనని చర్చించుకుంటున్నారు.

సైలెన్సర్ల మోత.. శబ్దాల రొద



- బైక్‌లకు పొగగొట్టాలు మార్చుతున్న యువత
- అధిక డెసిబుల్స్‌తో పర్యావరణానికి విఘాతం
- మోటారు వాహన చట్టాలు ఉల్లంఘన
- పోలీసుల ప్రత్యేక డ్రైవ్

(రణస్థలం)

రహదారులపై అడవి పంది అరుపులు, తుపాకీ పేల్చివేత శబ్దాలు, వివిధ రకాల హారన్‌లు ఇటీవల ఎక్కువగా వినిపిస్తున్నాయి. దీంతో సమీపంలో ఉండే వాహన చోదకులు, ప్రయాణికులు ఉలిక్కిపడుతున్నారు. ఏమైందోనని పక్కకు తిరిగి చూసే లోపు.. భారీ శబ్దంతో.. అతివేగంతో కుర్రకారు ద్విచక్ర వాహనాలపై దూసుకుపోతున్నారు. సైలెన్సర్లు (పొగ గొట్టాలు) మోత మోగిస్తుండడంతో ప్రజలు అసహనానికి గురవుతున్నారు. జిల్లాలో ద్విచక్ర వాహనాల అమ్మకాలు గణనీయంగా పెరిగాయి. ఇందులో కళాశాల యువత కొనుగోలు చేసే రేస్‌బైక్‌లే అధికం. షోరూముల్లో కొనుగోలు చేసినప్పుడు అవి సాధారణ బైక్‌లే. కానీ తరువాత వాటికి ఇష్టారాజ్యంగా విడిభాగాలను మార్చేస్తున్నారు. ముఖ్యంగా సైలెన్సర్లను మార్చి.. భారీ శబ్దాలనిచ్చే పరికరాలను అమర్చుతున్నారు. సైలెన్సర్లతో పాటు హ్యాండిల్, వీల్స్‌ను ఆకర్షవంతంగా, తమ అభిరుచులకు అనుగుణంగా మార్చేస్తున్నారు. కాలం చెల్లిన బైక్‌లను సైతం అందంగా రంగులద్ది రోడ్లపై తిప్పుతున్నారు. ముఖ్యంగా పాత బైక్‌లను వినియోగిస్తున్నారు. ఇందులో 90శాతం వాహనాలు పర్యావరణానికి, ప్రజలకు ఇబ్బంది కలిగించేవే. ఈ వాహనాల సైలెన్సర్లలో కొద్దిపాటి మార్పుచేస్తే అవి వెలువరించే శబ్దం ప్రత్యేకం. ఎదుటివారికి అసౌకర్యం. కానీ ఇవేవీ పట్టకుండా కుర్రకారు రహదారులపైకి వస్తుండడం రోత పుట్టిస్తోంది.

● వైల్డ్‌బోర్, కాక్‌టైల్ షార్టర్, డాల్ఫిన్, మెగాఫోన్, టెయిల్‌గన్నర్ వంటి రకరకాల పేరుతో వచ్చే సైలెన్సర్లు భారీ శబ్దాన్నిస్తాయి. వీటి ధర రూ.10వేల నుంచి రూ.23వేల వరకూ పలుకుతోంది. అనుసంధానంగా ఇతరత్రా పరికరాలు అమర్చేందుకు మెకానిక్‌కు మరో రూ.3వేల వరకూ చెల్లించాల్సి ఉంటుంది. వీటి ధర అధికమైనా కుర్రకారు లెక్క చేయడం లేదు. వాస్తవానికి ప్రతీ మోటారు వాహనం కంపెనీ తమ బైక్‌కు నిబంధనలకు అనుగుణంగా నిర్ణీత డెసిబుల్ శబ్దాన్ని వెలువరించే నిర్దిష్ట ప్రమాణాలతో సైలెన్సర్‌ను తీర్చిదిద్దుతాయి. అలాంటి డిజైన్లకే రవాణా శాఖ అనుమతిస్తుంది. మనిషి సాధారణంగా 60 డెసిబుల్స్ వరకూ శబ్దం వినగలరు. అంతకు మించి శబ్దం వింటే కర్ణభేరిపై ప్రభావం చూపుతుంది. వినికిడి లోపం కలుగుతుంది. కానీ సరికొత్త సైలెన్సర్ల నుంచి వచ్చే శబ్దానికి ఎక్కువ మంది యువత ఆకర్షితులవుతున్నారు. బైక్‌లతో రోడ్డెక్కి చుట్టుపక్కల వాహనదారుల గుండెల్లో అలజడి రేపుతున్నారు. ఆరోగ్యానికి హానికరమైనా, పర్యావరణానికి విఘాతం కలిగిస్తున్నా, పోలీసులు హెచ్చరిస్తున్నా బేఖాతరు చేస్తున్నారు.

● నిబంధనలు ఇవీ..

నిబంధనలకు విరుద్ధంగా శబ్ద కాలుష్యం చేస్తే వాహనదారుడిపై ఎంవీఐ యాక్ట్ 1988 సెక్షన్ 190(2) ప్రకారం పోలీసులు కానీ రవాణా శాఖ అధికారులు కానీ కేసు నమోదు చేస్తారు. సంబంధిత వాహనదారుడికి తొలిసారి అయితే కేసు నమోదుతోపాటు రూ.1,000 జరిమానా విధిస్తారు. రెండోసారి పట్టుబడితే రూ.2వేలు జరిమానాతో పాటు కఠిన చర్యలకు సిఫారసు చేస్తారు. మోటారు కంపెనీ ఉత్పత్తి చేసిన బైక్‌కు ఎట్టి పరిస్థితుల్లో విడి పరికరాలు మార్చకూడదు. ఇది చట్టరీత్యా నేరం. అలాగే శబ్దతీవ్రత పెరిగే కొలదీ రుగ్మతలు ఖాయమని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు.

● 60 డెసిబుల్స్‌లోపు శబ్దం వింటే ఎటువంటి ఇబ్బందులుండవు. 100 డెసిబుల్స్ శబ్దం దాటితే గుండె జబ్బులు ఉన్నవారిపై తీవ్ర ప్రభావం చూపుతుంది. 110 డెసిబుల్స్ శబ్దం దాటితే చికాకుతో పాటు విపరీతమైన కోపం, తలనొప్పి వస్తుంది. 120 డెసిబుల్స్ శబ్దం దాటితే చిరాకు, చర్మంపై రోమాలు నిక్కపొడుచుకోవడం, విపరీతమైన తలనొప్పి వస్తుంది. 160 డెసిబుల్స్ దాటితే చెవుల్లో వినికిడి కణాలపై ప్రభావం చూపుతాయి. నరాలు దెబ్బతిని పాక్షిక వైకల్యం కలుగుతుంది. 190 డెసిబుల్స్ శబ్దం దాటితే కర్ణభేరి పగిలిపోతోంది. శాశ్వతంగా వినికిడి శక్తి కోల్పోతారని వైద్యులు స్పష్టం చేస్తున్నారు.

● పోలీస్ శాఖ ప్రత్యేక దృష్టి

పర్యావరణాన్ని విఘాతం కలిగించే హెవీ సైలెన్సర్లు అమర్చే బైక్‌లపై పోలీసులు దృష్టి సారించారు. ఇటీవల శ్రీకాకుళంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి.. చాలా వాహనాలను పట్టుకున్నారు. ఇందులో ఎక్కువమంది యువకులే ఉండడంతో తల్లిదండ్రులను పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చి విడిచిపెట్టారు. కొన్ని సైలెన్సర్లను ధ్వంసం చేయించారు. ఇటువంటి వాహనాల విషయంలో కఠినంగా ఉండాలని, జిల్లావ్యాప్తంగా తనిఖీలు ముమ్మరం చేయాలని పోలీసులు భావిస్తున్నారు.



శ్రీకాకుళంలో సైలెన్సర్లను ధ్వంసం చేస్తున్న పోలీసులు (ఫైల్)

చట్టరీత్యా నేరం

అధిక శబ్దం కలిగించే సైలెన్సర్లను వినియోగించడం నేరం. కళాశాల యువతే ఎక్కువగా వినియోగిస్తున్నట్టు తనిఖీల్లో తేలింది. అందుకే పిల్లలు వినియోగించే బైక్‌లపై తల్లిదండ్రులు ఒక కన్నేసి ఉంచాలి. అధిక శబ్దం ఇచ్చే సైలెన్సర్లను అమర్చిన వారు వాటిని తొలగించాలి. లేదంటే జరిమానా విధించడంతో పాటు కేసులు నమోదు చేస్తాం.

- జి.రామచంద్రరావు, సీఐ, జేఆర్ పురం

అనర్థాలు అధికం

ఎక్కువ శబ్దం కలిగించే సైలెన్సర్లతో అనర్థాలు అధికం. వినికిడి లోపంతో పాటు మానసిక వ్యాధులు కలుగుతాయి. గుండె సంబంధిత వ్యాధులు ఉన్నవారు ఈ శబ్దం వింటే పెను ప్రభావం చూపుతుంది. చిరాకుతో పాటు విపరీతమైన కోపం, తలనొప్పికి సైలెన్సర్ల శబ్దాలు కారణమవుతాయి. అందుకే యువత ఇటువంటి వాటికి దూరంగా ఉండాలి.

- కృష్ణచైతన్య, వైద్యుడు, పాతర్లపల్లి పీహెచ్‌సీ

ఎస్పీగా కేవీ మహేశ్వరరెడ్డి

- జీఆర్ రాధికకు బదిలీ



కొత్త ఎస్పీ మహేశ్వరరెడ్డి (ఫైల్)

శ్రీకాకుళం క్రైం, జూలై 13: జిల్లాకు కొత్త ఎస్పీ రానున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుత ఎస్పీ జీఆర్ రాధికను బదిలీ చేసింది. కొత్త ఎస్పీగా కేవీ మహేశ్వరరెడ్డిని నియమిస్తూ శనివారం రాత్రి ఉత్తర్వులు జారీచేసింది. మహేశ్వరరెడ్డిది కడప ప్రాంతం. మధ్య తరగతి కుటుంబానికి చెందిన వ్యక్తి. పోలీసు శాఖపై మక్కువతో ఐపీఎస్ అయ్యారు. 2019 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన ఈయన.. తొలిసారిగా విశాఖపట్నం గ్రేహౌండ్స్‌లో పనిచేశారు. తర్వాత చింతూరు ఏఎస్పీగా రెండున్నరేళ్లు విధులు నిర్వర్తించారు. ప్రస్తుతం రంపచోడవరం ఓఎస్డీగా పనిచేస్తున్నారు. మొన్న సార్వత్రిక ఎన్నికల్లో నిష్పక్షపాతంగా, పార్టీలకు అతీతంగా విధులు నిర్వహించారు. తప్పు చేస్తే అధికార పార్టీ నేతలైనా ఉపేక్షించని నైజంతో పోలీసు శాఖలో తనకంటూ ఓ గుర్తింపును తెచ్చుకున్నారు. ఓఎస్డీ నుంచి ఎస్పీగా పదోన్నతి పొందుతూ.. జిల్లాకు రానున్నారు. కాగా.. జీఆర్ రాధిక 2022 ఏప్రిల్ 3న జిల్లాలో తొలి మహిళా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు ఆమె సీఐడీ హెడ్‌క్వార్టర్స్‌లో ఎస్పీగా విధులు నిర్వర్తించారు. ప్రస్తుతం ఆమెకు బదిలీ కాగా.. పోస్టింగ్ లభించలేదు. డీజీపీ కార్యాలయానికి రిపోర్ట్ చేయాల్సిందిగా ఉత్తర్వులు జారీచేశారు.



కాశీబుగ్గ సీఐ విజయానంద్‌కు ఫిర్యాదు కాపీలను అందిస్తున్న ఎమ్మెల్యే గౌతు శిరీష, టీడీపీ శ్రేణులు

సీదిరి అప్పలరాజుపై చర్యలు తీసుకోవాలి

- పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ఫిర్యాదు

పలాస, జూలై 13: మాజీమంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష కాశీబుగ్గ పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. అప్పటి అసెంబ్లీ సమావేశాల్లో మంత్రి హోదాలో అప్పలరాజు.. ప్రతిపక్ష నేతగా ఉన్న చంద్రబాబు నాయుడుపై అనుచిత వ్యాఖ్యలు చేశారని, మీడియాలో కూడా ఆయనపై తప్పుడు ప్రచారం చేసినందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. భారత రాజ్యాంగాన్ని కాపాడుతానని అసెంబ్లీలో ప్రమాణం చేసిన అప్పలరాజు అందుకు విరుద్ధంగా చంద్రబాబుపై ప్రవర్తించారన్నారు. చంద్రబాబు మానసిక పరిస్థితి సక్రమంగా లేదని, వైద్యుడికి చూపించాలని అప్పట్లో సీదిరి వ్యాఖ్యానించారని గుర్తుచేశారు. తాము దైవంగా కొలుచుకునే చంద్రబాబుపై ఈ వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నామన్నారు. విమర్శలు, ప్రతివిమర్శలతో సాగాల్సిన రాజకీయాలను భ్రష్టుపట్టించారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల్లో ఉండాలంటే విలువైన రాజకీయాలు చేయాలని సీదిరికి హితవు పలికారు. అసెంబ్లీలో అనుచితంగా వ్యవహరించిన సీదిరిపై ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయాలని సీఐ విజయానంద్‌కు ఫిర్యాదు పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వజ్జ బాబూరావు, పీరుకట్ల విఠల్‌రావు, లొడగల కామేశ్వరరావుయాదవ్, బడ్డ నాగరాజు, సప్ప నవీన్, గురిటి సూర్యనారాయణ, టంకాల రవిశంకర్‌గుప్తా, మల్లా శ్రీనివాస్, జోగ మల్లి, డొక్కరి శంకర్ పాల్గొన్నారు.

రూ.14లక్షలు స్వాహా

- ఉపాధిహామీ, కాలనీ ఇళ్ల పేరుతో దోపిడీ
- బేతాళపురం పంచాయతీలో మాజీ వలంటీర్ నిర్వాకం
- ఎంపీడీవో, ఎమ్మెల్యేకి లక్ష్మిపురం గ్రామస్థుల ఫిర్యాదు

హరిపురం, జూలై 13: ఉపాధిహామీ పథకం, జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణంలో గత ప్రభుత్వ హయాంలో వలంటీర్‌గా పనిచేసిన ఒక వ్యక్తి రూ.లక్షల్లో కొట్టేసిన వైనం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీనిపై గ్రామస్థులంతా ఎంపీడీవోకు, ఎమ్మెల్యే గౌతు శిరీషకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే.. మందస మండలం బేతాళపురం పంచాయతీ లక్ష్మిపురంలో వలంటీర్‌గా పనిచేసిన అడతాల మనోజ్ చేసిన స్వాహా పర్వం బయటపడింది. ఉపాధిహామీ పనులు, జగనన్న కాలనీ ఇళ్ల పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడి.. సుమారు రూ.14లక్షలు దోచేశాడని గ్రామస్థులు గుర్తించారు. దీనిపై ఈ నెల 1న ఆధారాలతో సహా ఎంపీడీవోకు ఫిర్యాదు చేశారు. కాగా.. మాజీ వలంటీర్‌పై ఇంతవరకూ ఎటువంటి చర్యలు తీసుకోలేదు. దీంతో శనివారం ఎమ్మెల్యే శిరీషకు వలంటీర్ నిర్వాహకంపై ఫిర్యాదు చేశారు. ఉపాధిహామీ పథకంలో పనులు గుర్తింపు ఒక ప్రాంతంలో అయితే .. వలంటీర్ సొంత కొబ్బరి తోటలో పనులు చేయించారని వివరించారు. ఇలా ఎందుకు అని అడిగితే అధికారం తమదని, తాను మంత్రి మనిషినంటూ, ఏ పథకం కావాలన్నా వలంటీర్‌నైన తనవద్దకే మీరు రావాలని బెదిరించారని పేర్కొన్నారు. తాను ఏం చెబితే అదే చేయాలని పనులు చేయించారని తెలిపారు. పనులకు రానివారి పేర్లు, విదేశాల్లో ఉన్నవారి పేర్లతో మస్తర్లు వేయించి.. రూ.లక్షల్లో దోచుకున్నారని ఆధారాలతో సహా బయటపెట్టారు. దీంతో పాటు కాలనీ ఇళ్లు పేరుతో.. ఎన్నో ఏళ్లుగా నిర్మించిన కొన్ని ఇళ్లకు బిల్లులు పెట్టి.. డబ్బులు స్వాహా చేశారని ఆరోపించారు. ఇలా సుమారు రూ.14లక్షలకుపైగా దోచేశాడని వెల్లడించారు. ఈ దోపిడీపై పూర్తిస్థాయిలో విచారణ చేసి.. మాజీ వలంటీర్ మనోజ్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు.



ఎమ్మెల్యే గౌతు శిరీషకు ఫిర్యాదు చేస్తున్న లక్ష్మీపురం గ్రామస్థులు




నగరంపై నల్లమబ్బులు

జిల్లాలోని వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. సిక్కోలు నగరాన్ని శనివారం మధ్యాహ్నం నల్లమబ్బులు కమ్మేశాయి. నగరమంతా కారుమబ్బులతో చీకటిమయమైంది. కొద్దిసేపటికే వర్షపు జల్లులు కురవడంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. ఉదయం ఎండతీవ్రత, ఉక్కపోతతో అల్లాడిన ప్రజలు.. సాయంత్రం కురిసిన వర్షంతో ఉపశమనం పొందారు.

- శ్రీకాకుళం అర్బన్



అమరావతిలో చంద్రబాబు బయోపిక్ ప్రారంభం



ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బయోపిక్ 'ధర్మ చక్ర' షూటింగ్‌ను తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ క్లాప్ కొట్టి శనివారం ప్రారంభించారు. రాజధాని గ్రామం మల్కాపురం వి స్క్వేర్ ఆడిటోరియంలో ఈ కార్యక్రమం జరిగింది. పసుపులేటి వెంకట రమణ దర్శకత్వంలో మనోహర్ నాయుడు నిర్మిస్తున్నారు. పది రోజుల పాటు అమరావతిలో షూటింగ్ జరుగుతుంది. ఇందులో రాజధాని కోసం భూములిచ్చిన రైతులు కూడా కళాకారులతో నటిస్తారు.

- తుళ్లూరు(ఆంధ్రజ్యోతి)

రూ. వెయ్యి కోట్ల క్లబ్‌లో కల్కి



ప్రభాస్ కథానాయకుడిగా నాగ్ అశ్విన్ దర్శకత్వం వహించిన 'కల్కి 2898 ఏడీ' చిత్రం బాక్సాఫీస్ వద్ద దుమ్మురేపే వసూళ్లతో దూసుకుపోతోంది. తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా హిందీ బెల్ట్‌లో, విదేశాల్లోనూ సంచలన వసూళ్లను సాధిస్తోంది. తాజాగా 'కల్కి' చిత్రం కీర్తి కిరీటంలో మరో మైలురాయి చేరింది. ఈ చిత్రం రూ. వెయ్యి కోట్ల వసూళ్లను అందుకున్నట్లు నిర్మాణ సంస్థ వైజయంతీ మూవీస్ శనివారం తెలిపింది. విడుదలైన మూడు వారాల తర్వాత కూడా బాక్సాఫీసు దగ్గర నిలకడైన వసూళ్లతో కొనసాగుతున్నట్లు తెలిపింది. ఈ చిత్రంలో అమితాబ్‌బచ్చన్, కమల్‌హాసన్, దీపికా పదుకొనే, దిశాపటానీ కీలకపాత్రలు పోషించారు. సి. అశ్వనీదత్ నిర్మించారు.


మోసపోయా.. ఆత్మహత్య చేసుకుంటా



నటుడు రాజ్ తరుణ్, అతని ప్రియురాలు లావణ్య వ్యవహారం రోజుకో మలుపు తిరుగుతోంది. రాజ్ తరుణ్ 11 ఏళ్ల తనతో సహజీవనం చేసి.. ఇప్పుడు మాల్వీ మల్హోత్రా అనే హీరోయిన్‌తో తిరుగుతూ తనను దూరం పెడుతున్నాడంటూ కేసు పెట్టిన లావణ్య.. శుక్రవారం రాత్రి ఆత్మహత్యా యత్నానికి పాల్పడినట్టు తెలిసింది. ఆత్మహత్య చేసుకుంటున్నానంటూ తన న్యాయవాదికి వాట్సాప్ చాటింగ్‌లో చెప్పడం.. ఆయన 112కు ఫోన్ చేయడంతో నార్సింగ్ పోలీసులు వెంటనే ఆమె ఇంటికి చేరుకుని కౌన్సిలింగ్ ఇచ్చారు. తనకు రూ.5 కోట్లు ఇస్తామని, కేసు వెనక్కి తీసుకోవాలని కొందరు బెదిరిస్తున్నారని న్యాయవాదితో చాటింగ్‌లో ఆమె పేర్కొన్నారు. రాజ్ తరుణ్ చేతిలో దారుణంగా మోసపోయాయని, ప్రతిదీ ఓ పథకం ప్రకారం జరిగిందన్నారు. అందుకే ఆత్మహత్య చేసుకోవాలనుకున్నానని, తన చావుకు రాజ్ తరుణ్, అతని తల్లిదండ్రులతో పాటు మాల్వీ మల్హోత్రా కారణమని పేర్కొన్నారు. లావణ్య శనివారం తన న్యాయవాదితో కలిసి నార్సింగ్ పోలీసుల ఎదుట విచారణకు హాజరై రాజ్ తరుణ్‌తో తనకు ఉన్న సంబంధంపై పలు విషయాలు వెల్లడించినట్టు తెలిసింది. నార్సింగ్ పోలీసులు పలు సెక్షన్ల కింద మాల్వ, మయాంక్, రాజ్ తరుణ్‌పై కేసు నమోదు చేశారు.


హైదరాబాద్ సిటీ/నార్సింగ్ (ఆంధ్రజ్యోతి)











ప్రత్యేక అలంకరణలో జగన్నాథుడు



జగన్నాథ రథయాత్రను పురస్కరించుకుని జిల్లాలో వివిధ గుండిచా మందిరాల్లో జగన్నాథ స్వామి వివిధ అలంకారాల్లో దర్శనమిచ్చారు. శనివారం రామావతారం, వేంకటేశ్వర అవతారాల్లో భక్తులు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. విశేష హారతులు, భోగాలను సమర్పించారు. కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

-ఆంధ్రజ్యోతి బృందం

ఎల్ఎన్‌పేట, సోంపేటలో రామావతారం, నరసన్నపేట: శేషుని పై కృష్ణావతారంలో, ఇచ్ఛాపురం: వెంకటేశ్వరస్వామిగా, శ్రీకాకుళం కల్చరల్: కూర్మావతారంలో స్వామి

రెల్లి కులస్థులకు ప్రత్యేక రిజర్వేషన్ కల్పించాలి

● సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గండి విజయకుమార్



మాట్లాడుతున్న రెల్లి కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు విజయ్‌కుమార్

సంతబొమ్మాళి (కోటబొమ్మాళి): రాష్ట్రంలో 26 లక్షల మంది రెల్లి, ఉప కులాల్లో ఉన్నారని, వీరికి రాజకీయ, ఆర్థిక, విద్య, ఉపాధి రంగాల్లో ప్రత్యేక రిజర్వేషన్ కల్పించాలని రెల్లి కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గండి విజయ్‌కుమార్ అన్నారు. శనివారం కోటబొమ్మాళి రెల్లి వీధి సుభాష్ చంద్రబోస్ కళా వేదికపై సంఘ ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెల్లి కులం అభివృద్ధి చెందాలంటే వర్గీకరణ చేసి 3 నుంచి 5 శాతం రిజర్వేషన్ కేటాయించాలన్నారు. రాష్ట్రంలో 26 లక్షల జనాభా ఉన్నప్పటికీ ప్రత్యేక రిజర్వేషన్ లేకపోవడంతో వివిధ రంగాల్లో ఎటువంటి ప్రాధాన్యత లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన గెజిట్‌లో రెల్లి కులం లేకపోవడం బాధాకరమన్నారు. తమ కులానికి అన్ని రిజర్వేషన్లు వర్తించేలా న్యాయ పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో కోటబొమ్మాళి సంఘ అధ్యక్షుడు కుప్పిలి మురళి, శ్రీకాకుళం, మన్యం, విజయనగరం, విశాఖ జిల్లాల నాయకులు గొల్లపల్లి మోహనరావు, వెలగాడ గురువులు, కాట సుదర్శన్, పేడాల కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

వరద నీరు వెళ్లేందుకు మార్గం లేక..

● కాలువ కప్పేయడంతో నీటిలో ఎద పొలాలు



జమ్ము వద్ద రోడ్డు పక్కన కాలువలు కప్పేయడంతో ఎద పొలాల్లో నిలిచిన నీరు

నరసన్నపేట: జమ్ము జంక్షన్ నుంచి పాతపట్నం వరకు 326ఏ జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా పలు ప్రాంతాల్లో రోడ్డుకిరువైపులా ఉన్న కాలువలను కప్పి రోడ్డు వేయడంతో ఏమాత్రం వర్షం కురిసినా పొలాల్లో చేరిన నీరు బయటకు వెళ్లేందుకు అవకాశం లేకుండా పోతోంది. దీంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సుమారు 40 కిలోమీటర్ల మేరకు రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. నరసన్నపేట, జలుమూరు, సారవకోట, పాతపట్నం మండలాల్లో పలు గ్రామాల వద్ద రైతులకు సాగునీటి ప్రవాహానికి రోడ్డుకు ఇరువైపులా ఉండాల్సిన పిల్లకాలువలు మూసుకుపోవడంతో గత రెండు రోజులుగా కురుస్తున్న చిన్నపాటి వర్షాలకు పొలాల్లో చేరిన నీరు కదలక పోవడంతో పంటలు పాడయ్యే అవకాశం ఉందని రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. జమ్ము, రావాడపేట, రాణ, చల్లపేట, వడ్డినవలస, అలుదు, బూర్జువాడ, ధర్మలక్ష్మీపురం తదితర గ్రామాల్లో ఇదే పరిస్థితి ఉందని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సాగునీటి కాలువల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.

సాగు హక్కులో ఉన్న భూమిలో రోడ్డు నిర్మాణం వద్దు

● దళిత మహిళ స్పష్టీకరణ

● వివాదాస్పద స్థలాన్ని పరిశీలించిన తహసీల్దార్

పలాసరూరల్: తన సాగు హక్కులో ఉన్న భూమిలో రోడ్డు నిర్మాణం చేపడితే తాను పోరాటం చేస్తానని ఓ దళిత మహిళ గ్రామస్థులతో వాగ్వాదానికి దిగిన ఘటన కాంట్రగడ గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. పలాస మండలం కాంట్రగడ గ్రామానికి చెందిన చింత సరస్వతికి 61/7లో 8 ఎకరాల భూమి ఉంది. దీనిని గతం నుంచి ఈ భూమి తన మామ చింతల బాలాజీ, కుమారుడు చింతల సుందరరావు సాగుహక్కులో ఉండగా, ఈ భూమిలో నుంచి రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు స్థానికులు ముందుకు రావడంతో ఆమె అడ్డుకుంది. ఈ వివాదం తహసీల్దార్ ఎస్‌వీఎస్ నాయుడు వద్దకు చేరడంతో వెంటనే ఆయన సదరు స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. పూర్తి వివరాలు అందించాలని ఆమెను కోరారు. బాధితురాలు సరస్వతి మాట్లాడుతూ.. రహదారి నిర్మాణం చేపట్టినప్పుడు ఇరువర్గాల భూములు సరిసమానంగా తీసుకోవాలని, తన భూమిపైకే రావడం ఏమిటని, దీనిపై తాను పోరాటం చేస్తానన్నారు, ఈ విషయమై తహసీల్దార్ ఎస్‌వీఎస్ నాయుడు వద్ద ప్రస్తావించగా గ్రామస్థుల వినతి మేరకు స్థల పరిశీలన చేశానని, రైతులకు చెందిన భూములు ఉండడంతో కల్వర్టు నిర్మాణం చేపడుతున్నారని, ఈ నిర్మాణానికి అడ్డు చెప్పడంతో వివాదం పెరిగిందన్నారు. అక్కడ సోషల్ వెల్ఫేర్ భూములున్నట్లు రికార్డుల్లో ఉందని, బాధితురాలి వద్ద ఉన్న రికార్డులను పరిశీలించి న్యాయం చేస్తామన్నారు.

వర్షం కురిస్తే ఇబ్బందులే..





టెక్కలి ఆర్టీసీ కాంప్లెక్స్‌లోకి చేరిన వర్షపు నీరు, ఆది ఆంధ్ర వీధి కాలువలో పేరుకుపోయిన చెత్తను తీస్తున్న స్థానికుడు

మెళియాపుట్టి(టెక్కలి): టెక్కలి పట్టణంలో ఏమాత్రం వర్షం కురిసినా పలు వీధుల్లో నీరు నిలిచి పోయి స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలువల్లో సిల్ట్ పేరుకుపోయి మురుగునీరు, చెత్త చెదారాలు నిలిచిపోవడంతో పాటు వర్షపునీరు కలిసి రోడ్లపై రోజుల తరబడి నిలిచిపోయి ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. ప్రధానంగా ఆది ఆంధ్ర వీధి, మండాపొలం కాలనీ, ఎన్‌టీఆర్ కాలనీలతో పాటు పలు ప్రాంతాల్లో శనివారం కురిసిన చిన్నపాటి వర్షానికే కాలువల్లోని నీరు వెళ్లలేని పరిస్థితి ఎదురైంది. దీంతో స్థానికులు కాలువల్లో నీటి ప్రవాహానికి అడ్డంకిగా ఉన్న చెత్తను తీయడం కనిపించింది. అలాగే ఆర్టీసీ కాంప్లెక్స్‌లో సైతం నీరు నిలిచిపోయి ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు. పంచాయతీ అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

వర్షంతో రైతన్నల హర్షం

పలాసరూరల్: పలాస మండలంలో శనివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సుమారు గంటన్నర పాటు వర్షం కురవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కాలం లో ఆకుమడులకు సరైన వర్షం లేకపోవడంతో ఎండి పోతున్న తరుణంలో ఈ వర్షం ఎంతో ఉపకరించిందని, ఎదలు వేసిన వారికి కూడా సరైన సమయంలో వర్షం పడడం లాభదాయకమని ఆశాభావం వ్యక్తం చేశారు. ● **సంతబొమ్మాళి:** మండలంలో శనివారం సాయంత్రం కురిసిన వర్షం రైతులకు ఊరట నిచ్చింది. ఉదయం నుంచి ఎండ తీవ్రత ఉండడంతో ప్రజలు ఉక్క పోతకు గురికాగా సాయంత్రం వర్షంతో కొంత ఉపశమనం పొందారు. ఈ వర్షంతో విత్తనాలు వేసిన మడులకు ఎంతగానో ఉపయోగపడుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ● **నందిగాం:** మండలంలో శనివారం కురిసిన వర్షం రైతులకు ఊరటనిచ్చింది. గత పది రోజులుగా వర్షాలు లేకపోగా ఎండలతో ఎదలు, నారుమళ్లు ఎండిపోవడంతో రైతులు నిరాశకు గురయ్యారు. అయితే శనివారం పడిన మోస్తరు వాన నారుమళ్లకు, ఎదలకు ఊపిరి పోసినట్లయింది. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

పోటీతత్వంతోనే ఉత్తమ ఫలితాలు

శ్రీకాకుళం స్పోర్ట్స్: పోటీతత్వంతోనే క్రీడల్లో ఉత్తమ ఫలితాలు సాధించవచ్చునని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. స్థానిక శాంతినగర్ కాలనీలోని ఇండోర్ స్టేడియంలో శనివారం జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీల ప్రారంభోత్సవం ఆయన పాల్గొని మాట్లాడారు. క్రీడాకారులు గెలుపు, ఓటములతో సంబంధం లేకుండా క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలన్నారు. ఇటువంటి పోటీలతోనే ఎందరో జిల్లా నుంచి జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్నారన్నారు. ఈ పోటీల్లో సుమారు 270 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. జిల్లా బ్యాడ్మింటన్ అధ్యక్షుడు కిలంశెట్టి సాగర్, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి శ్రీధర్, ఎంవీ రమణ, కమల విలేఖర్, జి.భీమారావు, ఎం.అశోక్‌కుమార్, అనిల్‌కుమార్, శాంతికుమార్ పాల్గొన్నారు.

అన్ని గ్రామాలకు వంశధార నీరు: ఎమ్మెల్యే శిరీష



కాశీబుగ్గ: వంశధార నీటికి హారతి ఇస్తున్న ఎమ్మెల్యే శిరీష

కాశీబుగ్గ: కాశీబుగ్గ రైల్వే గేటు వద్ద చినబాడం రోడ్డులో వంశధార నీటికి శనివారం ఎమ్మెల్యే గౌతు శిరీష జలహారతి ఇచ్చి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో రైతులకు చుక్క నీరు వంశధార కాలువల ద్వారా అందించలేక పోయారని విమర్శించారు. మాజీ మంత్రి అప్పలరాజు కేవలం భూ ఆక్రమణలు, వసూలు పర్వం చేశారే తప్ప రైతుల కోసం ఆలోచించలేదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన నెల రోజుల్లోనూ వంశధార నీటిని పొలాలకు అందించామన్నారు. సాగునీటి విడుదలకు కృషి చేసిన సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి అచ్చెన్నాయుడులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వజ్జ బాబూరావు, లొడగల కామేశ్వరరావు, బడ్డ నాగరాజు, గాలి కృష్ణారావు, నవీన్, పలువురు రైతులు పాల్గొన్నారు.

బ్రాహ్మణుల సమస్యలను పరిష్కరించండి

బ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని రాష్ట్ర ఒడియా బ్రాహ్మణ సంఘ అధ్యక్షుడు శివాజీ పాణిగ్రాహి కోరారు. ఈ మేరకు శనివారం ఎమ్మెల్యే గౌతు శిరీషను కలిసి అభినందించారు. గత టీడీపీ హయాంలో బ్రాహ్మణులకు వివిధ పథకాలు అందేవని, వైసీపీ ప్రభుత్వం రాకతో అవి మూలకు చేరాయన్నారు. వాటిని తిరిగి అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘ సభ్యుడు చంద్రశేఖర్ త్యాడి, సభ్యులు బాబూరావు పండా, దేవేంద్ర, రవి నారాయణ పండా, జనసేన నాయకుడు సంతోష్‌పండా తదితరులు పాల్గొన్నారు.

వాసుదేవునికి ప్రత్యేక పూజలు

మందస: ఎమ్మెల్యే గౌతు శిరీష, వెంకన్న చౌదరి దంపతులు శనివారం మందస వాసుదేవ పెరుమాళ్‌ను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వారికి ఆలయ ప్రధానార్చకులు కూర్మాచార్యులు వేదమంత్రాల నడుమ స్వాగతం పలికారు. పట్టువస్త్రాలను కప్పి ఆశీర్వదించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు భావన దుర్యోధన, నేతలు పీరికట్ల విఠల్, డొంకూరు తిరుపతి, త్రివేణి, దాసరి తాతా రావు, ప్రకాశ్ పాణిగ్రాహి, డి.మార్కండేయులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు విస్తృతం చేస్తా: ఎమ్మెల్యే ఎంజీఆర్



ఎమ్మెల్యే గోవిందరావును సత్కరిస్తున్న విశ్వబ్రాహ్మణ సంఘ నాయకులు

పాతపట్నం: ఎమ్మెల్యే కాకముందు తాను చేసిన సామాజిక సేవా కార్యక్రమాలను భవిష్యత్‌లోనూ కొనసాగిస్తానని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. శనివారం స్థానికంగా ఓ కల్యాణ మండపంలో విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం ప్రతినిధులు సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనను ఎమ్మెల్యేగా గెలిపించడం ద్వారా మరింత బాధ్యత పెరిగిందన్నారు. సేవా కార్యక్రమాలు చేపట్టడం ద్వారా అండగా ఉంటానన్నారు. అంతకుముందు మామిడి అప్పారావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా డీఎస్సీ కోచింగ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల, పట్టణ అధ్యక్షులు పైల బాబ్జీ, సైలాడ సతీష్ నేతలు తులసీవర ప్రసాద్, తిరుపతిరావు మాస్టారు, ఐదు మండలాల విశ్వ బ్రాహ్మణ సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులను విస్మరిస్తే ప్రతిఘటన

నందిగాం: ప్రభుత్వ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులను విస్మరిస్తే ప్రతిఘటిస్తామని పలువురు సభ్యులు అన్నారు. శనివారం ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ నడుపూరు శ్రీరామ్మూర్తి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖపై జరిగిన చర్చలో వ్యవసాయాధికారి పి.శ్రీకాంత్‌వర్మ కౌలురైతుల గుర్తింపు సదస్సులు నిర్వహిస్తున్నామని పేర్కొనగా ఈ విషయం మాకు తెలియదని పలువురు సభ్యులు పేర్కొన్నారు. దీంతో ఎంపీపీ కలుగజేసుకుని ప్రభుత్వ కార్యక్రమాలకు నిబంధనల మేరకు సభ్యులను ఆహ్వానించాలని, వారి హక్కులకు భంగం కలిగిస్తే కోర్టును ఆశ్రయిస్తామన్నారు. శివరాంపురం సర్పంచ్ ఎస్.జానకిరాం మాట్లాడుతూ.. ఎంపీ రామ్మోహన్ నాయుడు కేంద్రమంత్రిగా, ఎమ్మెల్యే అచ్చెన్నాయుడు రాష్ట్ర మంత్రిగా నియమితులయ్యారని, వారి ఆధ్వర్యంలో మండలాన్ని అభివృద్ధి చేద్దామన్నారు.

దాసరి మృతి టీడీపీకి తీరని లోటు

హరిపురం: టీడీపీ సీనియర్ నేత దాసరి శ్రీరాములు మృతిచెందడం పార్టీకి తీరని లోటని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. సువర్ణాపురం గ్రామంలో శనివారం ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని పేర్కొన్నారు. ఆమెతో పాటు పలువురు టీడీపీ నేతలు ఉన్నారు.

కిడ్నీ బాధితుడికి ఆర్థిక సాయం

సంతబొమ్మాళి: కిడ్నీ బాధితుడు గయ సందీప్‌కు బడే కుప్పన్నపేట కేపీ ఫౌండేషన్, వల్లేవలస మన బడి అసోసియేషన్ ఆర్థిక సాయం అందించాయి. కిడ్నీ మార్పిడి చేసుకున్న సందీప్ నిరుపేద కావడంతో రూ.25 వేల మొత్తాన్ని అందించినట్లు సంస్థ ప్రతినిధులు రెడ్డి సూరిబాబు, షన్ముఖరావు తదితరులు తెలిపారు.

క్రీడాస్థలం మంజూరుకు కృషి చేయండి

వజ్రపుకొత్తూరు: కొమరల్తాడ పంచాయతీ తామాడవానిపేటలోని పాఠశాలకు ఆటస్థలం మంజూరుకు కృషి చేయాలని పలాస జనసేన సమన్వకర్త విదుర్గారావును గ్రామస్థులు కోరారు. శనివారం ఆయనను కలిసి వినతిపత్రం అందించారు. పాఠశాలలో 90 మంది విద్యార్థులున్నారని, క్రీడా స్థలం లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వంతో మాట్లాడి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్ర మంలో కొమరల్తాడ జనసేన అధ్యక్షుడు చింత మోహన్, తామాడ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి నౌపడలో సంబరాలు

సంతబొమ్మాళి: నౌపడలో ఆదివారం నుంచి మంగళవారం వరకు బండ్ల వారి సంబరాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రధాన రోడ్డులో విద్యుద్దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సంబరాల్లో సాంఘిక, పౌరాణిక నాటకాలతో పాటు నృత్యాలు, వేష ధారణలు ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మూడోరోజు గ్రామస్థులు గ్రామ దేవత పాలపోలమ్మకు ముగ్గురాటలతో చల్లదనం చేసి మొక్కులు చెల్లించుకుంటారని పేర్కొన్నారు.

వాటర్ ట్యాంక్‌ను శుభ్రం చేసిన యువకులు

సంతబొమ్మాళి: బోరుభద్రలోని రక్షిత నీటి పథకం ట్యాంక్‌ను గ్రామానికి చెందిన యువకులు శనివారం శుభ్రం చేశారు. వర్షాలు కురుస్తున్నందున అంటు వ్యాధులు ప్రబలకుండా బ్లీచింగ్ వేసి శుభ్ర పరిచారు. తెలుగు యువత నాయకుడు వజ్జ ప్రభాకర్, ఐటీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి అప్పిని వెంకటేష్, యువకులు కార్తీక్, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

ఇసుకకు తప్పని ఇబ్బందులు



టెక్కలిలో ఇసుక రీచ్ వద్ద బారులు తీరిన ట్రాక్టర్లు

మెళియాపుట్టి (టెక్కలి): ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం ప్రారంభించినప్పటికీ జిల్లాలో రెండు రీచ్‌లకు మాత్రమే అనుమతులివ్వడంతో జిల్లా నలుమూలల నుంచి టెక్కలికి ట్రాకర్లు తరలివచ్చి నిలిచి పోతున్నాయి. సుమారు మూడు కిలోమీటర్ల మేర ట్రాక్టర్లు బారులు ఏర్పడడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. స్థానిక డిగ్రీ కళాశాల నుంచి తొలుసూరుపల్లి గ్రామం వరకు ట్రాక్టర్లు నిలపడంతో వాహన దారులు ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కో ట్రాక్టర్ రెండు రోజుల వరకు క్యూలో ఉంటేనే ఇసుక దొరుకుతోందని పలువురు ట్రాక్టర్ యజమానులు చెబుతున్నారు. దీంతో వెయిటింగ్ చార్జీలంటూ వినియోగదారులపై అదనపు భారం వేస్తున్నట్లు తెలుస్తోంది. ఇసుక రీచ్ వద్ద ఒక కౌంటర్ ఏర్పాటు చేయడం వల్ల ఆలస్యం అవుతోందని పలువురు చెబుతున్నారు. అదనపు కౌంటర్లను ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

శ్రీముఖలింగేశ్వరుని సేవలో ఎన్నికల కమిషన్ జాయింట్ సెక్రటరీ



ఆలయ ఆవరణలో జీవీఎస్ ప్రసాద్ దంపతులు

జలుమూరు: దక్షిణకాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీముఖలింగంలోని శ్రీముఖలింగేశ్వర స్వామిని రాష్ట్ర ఎన్నికల కమిషన్ జాయింట్ సెక్రటరీ జీవీఎస్ ప్రసాద్ శనివారం కుటుంబ సమేతంగా దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు, దేవాలయ సిబ్బంది ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి వారి గోత్ర నామాలతో ప్రత్యేక పూజలు, అభిషేకం చేయించారు. అనంతరం స్వామివారి శేష వస్త్రాలు అందించి ఆశీర్వదించారు. ఆలయ విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ తమ్మన్నగారి సతీష్, అర్చకులు నారాయణమూర్తి, శ్రీకృష్ణ, శివ, దేవాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

పోలాకి: తొలకరి వర్షాలు కురుస్తున్నందున ప్రజలు అంటురోగాల బారిన పడే అవకాశం ఉందని అందువల్ల అన్ని గ్రామాల్లో వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని పోలాకి, గుప్పెడుపేట వైద్యాధికారులు శ్రీనాథ్, రత్నరాజు తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ.. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. గంటపేట, చెల్లాయివలస ప్రాంతాల్లో అక్కడక్కడ జ్వరాలు సోకినట్టు సమాచారం రాగా ఆ గ్రామాలకు వెళ్లి చికిత్సలు అందించామని వైద్యాధికారి శ్రీనాథ్ తెలిపారు. ఎక్కడైనా జ్వరాలు వ్యాప్తి చెందితే వెంటనే సమీపంలోని ఆశ కార్యకర్తకు సమాచారం అందించి పీహెచ్‌సీల్లో వైద్య సేవలు పొందాలని కోరారు.

పశుగ్రాసం సాగుపై ఆసక్తి పెంచుకోవాలి

పలాసరూరల్: ప్రస్తుతం పశుగ్రాసం కొరత అధికంగా ఉన్నందున రైతులు పశుగ్రాసాన్ని సాగు చేయడంపై ఆసక్తి పెంచుకోవాలని పశు సంవర్ధక శాఖ ఏడీ డా.పోతనపల్లి చంద్రశేఖర్ అన్నారు. పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా తర్లాకోట గ్రామంలో శనివారం పశుగ్రాసం పంట సాగు, తౌడు తయారీ పద్ధతులను వివరించారు. పశుగ్రాసాన్ని పెంచేందుకు ప్రభుత్వం సహకారం అందజేస్తుందని, దానిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించండి

హిరమండలం: మండలంలోని పలు గ్రామాల్లో నెల కొన్న విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని జడ్పీటీసీ పి.బుచ్చిబాబు ట్రాన్స్‌కో ఏఈ శంకరరావును కోరారు. ఈ మేరకు ఏఈ సుభలయ ఆర్ఆర్ కాలనీలో శనివారం పర్యటించారు. గ్రామంలోని విద్యుత్ సమస్యలను జడ్పీటీసీ వివరించారు. కొన్ని చోట్ల విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయాల్సి ఉందని, త్వరలో సమస్యలను పరిష్కరిస్తానని ఏఈ తెలిపారు.

గిరిజనులకు కొండచీపురు విత్తనాల పంపిణీ

మెళియాపుట్టి/పాతపట్నం: గిరిజనులకు కొండ చీపురు విత్తనాలను కొత్తూరు వెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో మెళియాపుట్టి, పాతపట్నం మండలాల్లో వివిధ గ్రామాల్లో శనివారం అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ సీసీ జగన్ మాట్లాడూతూ.. గిరిజనులు ఆర్థికంగా స్వావలంబన సాధించేందుకు కొండ చీపురు పెంపకం దోహదపడుతుందన్నారు. పెట్టుబడి లేకుండా ఆదాయం పొందేందుకు అవకాశం ఉందన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కేరాశింగి సర్పంచ్ ఆదిలక్ష్మి, ఎస్.కామేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పీర్ల పండగ

జలుమూరు: కూర్మనాథపురంలో మతాలకు అతీతంగా ముస్లింల పండగైన మొహర్రంను హిందువులు నిర్వహించి మత సామరస్యాన్ని చాటుకున్నారు. మసీదు పెద్ద షేక్ యాకూబ్ ఆధ్వర్యంలో ఉదయం నుంచి గ్రామస్థులు పీర్ల వద్ద బిందెలతో వెలిగించిన దీపాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. రాత్రి అగ్ని గుండంపై భక్తులు నడిచి భక్తిని చాటుకున్నారు.

పంచాయతీ కార్యదర్శిపై మరో ఫిర్యాదు

- ధ్రువ పత్రాల పేరిట రూ.49 వేలు వసూలు
- ఎంపీడీవోకి విన్నవించిన లోహరిబంద గ్రామస్థులు
- శాఖాపరమైన విచారణకు కార్యదర్శి సతీష్‌బాబు గైర్హాజరు
- అతడి భాగోతంపై కలెక్టర్‌కి పూర్తిస్థాయి నివేదిక

శ్రీకాకుళం క్రైం: నిరుద్యోగులకు ఉద్యోగాలిప్పిస్తామంటూ మోసం చేసిన పంచాయతీ కార్యదర్శి సతీష్‌బాబుపై మరో ఫిర్యాదు నమోదైంది. వివరాల్లోకి వెళ్తే.. మందస మండలం లోహరిబంద పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న మన్నం సతీష్‌బాబు వివిధ ధ్రువపత్రాలు ఇప్పిస్తానంటూ ఆ గ్రామస్థుల నుంచి రూ.49 వేలు వసూలు చేశాడు. ఈ మేరకు గ్రామస్థులంతా శుక్రవారం మందస ఎంపీడీవో రఘుపతికి తమకు జరిగిన అన్యాయాన్ని వివరించి ఫిర్యాదు చేశారు. పంచాయతీ కార్యదర్శి కావడంతో నమ్మి డబ్బులు ఇచ్చామని ఆవేదన వ్యక్తం చేశారు. పత్రాలు ఇవ్వకపోగా తమ డబ్బులు కూడా తిరిగి ఇవ్వలేదని ఎంపీడీవో వద్ద మొరపెట్టుకున్నారు. దీనిపై ఎంపీడీవో రఘుపతి జిల్లా పంచాయతీ అధికారికి సమాచారం అందించారు. అతడిపై చర్యలు తీసుకుని గ్రామస్థులకు న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో వారంతా వెనుదిరిగారు.

విచారణకు గైర్హాజరు.. కలెక్టర్‌కు నివేదిక

శ్రీకాకుళం నగరంలోని క్రిస్టియన్ కాలనీలో నివసిస్తున్న పిల్లా నరేష్‌కు ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి రూ.5,11,392 తీసుకుని మోసం చేశాడంటూ ఈ నెల 1న బాధితుడు స్పందనకు ఫిర్యాదు చేశాడు. దీనిపై స్పందించిన కలెక్టర్ విచారణకు డీపీవోను ఆదేశించారు. దీంతో ఈ నెల 12న శాఖాపరమైన విచారణకు హాజరు కావాలని కార్యదర్శి సతీష్‌బాబుకు మందస ఎంపీడీవో నోటీసు ఇచ్చారు. అయితే విచారణకు సతీష్‌బాబు హాజరుకాలేదు. దీంతో నివేదికను డీపీవోకు ఎంపీడీవో అందించారు. కాగా ఈ నివేదికలో సతీష్‌బాబుపై గ్రామస్థుల నుంచి వస్తున్న ఆరోపణలు, విచారణకు గైర్హాజరు వంటి పలు విషయాలు పొందుపరిచినట్టు సమాచారం. అయితే ఈ నివేదికను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కి డీపీవో శనివారం అందజేశారు.

గిరిజన ఆశ్రమాన్ని సందర్శించిన నగర కమిషనర్



పారిశుధ్య పనులు చేయిస్తున్న కమిషనర్ ఓబులేసు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

శ్రీకాకుళం అర్బన్: నగరంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమాన్ని శనివారం నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు సందర్శించారు. ఆశ్రమంలోని సమస్యలపై 'ఆంధ్రజ్యోతి'లో 'గిరిజన ఆశ్రమంలో సమస్యల తిష్ఠ' శీర్షికతో శనివారం ప్రచురితమైన కథనంపై కమిషనర్ స్పందించారు. దీంతో ఆశ్రమాన్ని సందర్శించి పారిశుధ్య పనులు చేయించారు. మురుగు గుంతలను కప్పించారు. అనంతరం కమిషనర్, ట్రైబుల్ వెల్ఫేర్ డీడీ ఎస్.అన్నదొరతో కలిసి ఆశ్రమ విద్యార్థులతో మాట్లాడి, వసతి సౌకర్యాలపై ఆరా తీశారు. అలాగే ఇన్‌చార్జి వార్డెన్ వి.తులసీరామ్ పాఠక్, హెచ్‌ఎం పి.రాజగోపాలరావుతో మాట్లాడి పిల్లలకు పౌష్టికాహారాన్ని అందించాలని, పరిశుభ్రతపై దృష్టి సారించాలన్నారు. హెల్త్ ఆఫీసర్ వెంకటరావు, ట్రైబుల్ వెల్ఫేర్ సూపరింటెండెంట్ దేస్, కార్యాలయ సిబ్బంది కృష్ణవేణి, శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

దుబాయ్ నుంచి వచ్చిన మరునాడే..

- రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



నవీన్ (ఫైల్)

సోంపేట: కుటుంబ పోషణ కోసం ఆ యువకుడు దుబాయ్ వెళ్లాడు. రెండేళ్ల తరువాత ఎంతో ఆనందంగా స్వగ్రామానికి వచ్చాడు. అయితే, వచ్చిన మరుసటి రోజే రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. లారీ రూపంలో మృత్యువు అతన్ని కబళించింది. దీంతో ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. పోలీసులు తెలిపిన వివరాలు మేరకు.. కొర్లాం సమీపంలో జాతీయరహదారిపై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తోట నవీన్ (23) అనే యువకుడు దుర్మరణం చెందాడు. నవీన్ తన స్నేహితుడు శివాజీతో కలిసి స్వగ్రామం పాలవలస నుంచి ద్విచక్ర వాహనంపై కొర్లాం వెళ్తుండగా జాతీయరహదారిపై వెనుక నుంచి వస్తున్న లారీ బలంగా ఢీకొట్టింది. దీంతో నవీన్ అక్కడికక్కడే మృతిచెందగా.. తీవ్రంగా గాయపడి శివాజీని ఆసుపత్రికి తరలించారు. దుబాయ్‌లో వీరిద్దరూ పనిచేస్తున్నారు. శివాజీ పదిరోజుల కిందట ఇంటికి రాగా, నవీన్ శుక్రవారమే స్వగ్రామానికి వచ్చాడు. శివాజీకి సోంపేట ఆసుపత్రిలో చికిత్స అందించి మెరుగైన చికిత్స కోసం బరంపురం తరలించారు. బారువ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా నవీన్‌కి తండ్రి నారాయణ, తల్లి సంతోషి, సోదరుడు ఉన్నారు. నవీన్ సంపాదనపైనే వీరంతా ఆధారపడి జీవిస్తున్నారు.

పోస్టల్ ఉద్యోగులకు ఎక్సలెన్స్ అవార్డులు



అవార్డు అందజేస్తున్న దృశ్యం

అరసవల్లి: నగరంలోని ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో 2023 - 24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి శ్రీకాకుళం పోస్టల్ డివిజనల్ లెవెల్ ఎక్సలెన్స్ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ పోస్టల్ సర్కిల్ అసిస్టెంట్ డైరెక్టర్ జి.శివనాగరాజు ముఖ్య అతిథిగా హాజరై డివిజన్‌లో అన్ని కేటగిరీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు అవార్డులను అందజేసారు. ఇదే ఉత్సాహాన్ని మున్ముందు కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోస్టల్ సూపరింటెండెంట్ వి.హరిబాబు, అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఏ.శ్రీనివాసరావు, జీఎం.షరీఫ్, సబ్ డివిజనల్ హెడ్స్ హెడ్ పోస్టుమాస్టర్లు, సబ్ పోస్టుమాస్టర్లు, బ్రాంచ్ పోస్టుమాస్టర్లు, పోస్టుమెన్, డివిజన్‌లోని ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దు చేయాలి



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు శివరామ్‌ప్రసాద్

ఇచ్ఛాపురం: సీపీఎస్ (కంట్రీబ్యూటరీ పెన్షన్ స్కీం)ను రద్దు చేసి పాత పెన్షన్ (ఓపీఎస్) విధానాన్ని అమలు చేయాలని ఏపీయూఎస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దుప్పల శివరామ్‌ప్రసాద్, కీలు సోమేశ్వరరావు డిమాండ్ చేశారు. శనివారం ఇన్నేసుపేట ఎంపీపీఎస్ పాఠశాలలో ఏపీయూఎస్ మండల అధ్యక్షుడు బి.శంకరం అధ్యక్షత జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వం జీపీఎస్‌ను అమలు చేసుందుకు ప్రయత్నించి జీవోను కూడా విడుదల చేసిందన్నారు. పోరాటాల ఫలితంగా ఆ జీవో తాత్కాలికంగా ఆగిందన్నారు. సీపీఎస్, జీపీఎస్ విధానా న్ని పునఃసమీక్షించి ఆమోదయోగ్యమైన పరిష్కారానికి కృషి చేస్తామని టీడీపీ కూటమి ప్రభుత్వం ఎన్నికల మెనిఫెస్టోలో పొందుపరిచిందన్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత ఇందుకు భిన్నంగా పాత తేదీతో జీపీఎస్ అమలు చేసేందుకు జీవోను, గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయటం దుర్మార్గపు చర్యగా భావిస్తున్నామని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ జీవోను తక్షణమే రద్దు చేసి పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బి శంకరం, ఎం తారకేశ్వరరావు, తదితర సంఘ నాయకులు పాల్గొన్నారు.



వరద వస్తే వణుకే!

- ఏటా కోతకు గురవుతున్న భూములు
- పట్టించుకోని యంత్రాంగం
- ఆందోళనలో నాగావళి పరీవాహక రైతులు

(ఎచ్చెర్ల)

వర్షా కాలం వచ్చిందంటే చాలు ఆ గ్రామాల్లోని రైతుల గుండెల్లో రైళ్లు పరుగెడుతుంటాయి. ముఖ్యంగా ఒడిసాలో విస్తారంగా వర్షాలు కురిస్తే నాగావళి పరివాహక ప్రాంతాల్లో పొలాలు ఉన్న రైతుల్లో ఆందోళన మొదలవుతుంది. వర్షాకాలం, అకాల వర్షాల వరద బీభత్సానికి పంటపొలాలు నదిలో కలిసిపోతున్నాయి. ఈ కారణంగా దీంతో ఏటా రైతులకు ఎంతో కొంత నష్టం జరుగుతూనే ఉంది. ఈ సమస్య ఎప్పటినుంచో ఉన్నా పట్టించుకొనే పాలకులే కరు వయ్యారు. ఇదీ ఎచ్చెర్ల మండలంలో నాగావళి నదీ తీరంలో పంట పొలాలు ఉన్న రైతుల దీనస్థితి.

ఏటా ఇబ్బందే..

ఎచ్చెర్ల మండలం తమ్మినాయుడుపేట, తోటపాలెం, పొన్నాడ, బొంతలకోడూరు గ్రామాలు నాగావళి నది ఒడ్డున ఉన్నాయి. వరదకట్టలు (గ్రోయన్స్) లేక లక్షలాది రూపాయలు విలువ చేసే పంట భూములు నాగావళి నదీ గర్భంలో కలిసిపోతున్నాయి. దీంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. నాగావళి పరివాహక ప్రాంత రైతులకు ప్రతీ ఏటా ఈ సమస్య తప్పడంలేదు. నీటి ప్రవాహం అధికంగా ఉన్నప్పుడు ప్రవహదిశ మారి ఒడ్డున ఉన్న భూములు నదిలో కలిసిపోతున్నాయి. దీంతో నదీ తీరాన జిరాయితీ పంటపొలాలు ఉన్న రైతులు ఏటా ఎంతోకొంత మేర భూములను కోల్పోవల్సివస్తుంది. నదీ తీరంలో వరదకట్టలు నిర్మిస్తామన్న అధికారులు, ప్రజాప్రతినిధులు మాటలు గాలిలోనే కలిసిపోతున్నాయి.



పొన్నాడ వద్ద నాగావళి నది కోతకు గురవుతున్న భూములు

వరద వస్తే నష్టమే..

1990 సంవత్సరంలో, ఆ తర్వాత సంభవించిన వరదలకు ఈ ప్రాంత రైతులకు చాలా నష్టం జరిగింది. 1990 వరదలకు పొన్నాడలో సుమారు 100 ఎకరాలు కోతకు గురయింది. అలాగే తమ్మినాయుడుపేటలో 25 ఎకరాలు, తోటపాలెంలో 10 ఎకరాలు, బొంతలకోడూరులో 25 ఎకరాలు నాగావళి నదిలో కలిసిపోయింది. ఆ తర్వాత కూడా భూములు నదిలో కలిసిపోతూనే ఉన్నాయి. సుమారు రెండున్నర దశాబ్దాల క్రితం నిర్మించిన గ్రోయన్స్ పాడయ్యాయి. గతంలో గ్రోయన్స్ నిర్మాణానికి చర్యలు చేపట్టినా.. పనులు ముందుకు సాగలేదు. ప్రభుత్వాలు మారుతున్నా.. ప్రజాప్రతినిధులు మారుతున్నా గ్రోయన్స్ నిర్మాణం మాత్రం జరగడం లేదని రైతులు అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు.

రైతుల ఇబ్బందులు గుర్తించాలి

నాగావళి నదీతీరాన ఉన్న భూములు ఏటా కోతకు గురవుతున్నాయి. దీనివల్ల రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో గ్రోయన్స్ నిర్మిస్తామన్న ప్రతిపాదన కార్యరూపం దాల్చలేదు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి కరకట్టలు నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకోవాలి.

- పంచిరెడ్డి కృష్ణారావు, మాజీ సర్పంచ్, పొన్నాడ

స్టేడియం పనులకు వీడిన గ్రహణం

- ఎమ్మెల్యే చొరవతో పునఃనిర్మాణ పనులకు శ్రీకారం

శ్రీకాకుళం స్పోర్ట్స్: జిల్లా కీర్తి ప్రతిష్ఠలను అంతర్జాతీయస్థాయిలో ఇనుమడింజేసిన కోడి రామ్మూర్తి స్టేడియం గత పాలకుల నిర్లక్ష్యానికి పునః నిర్మాణ పనులకు నోచుకోలేదు. స్టేడియంను అంతర్జాతీయ ప్రమాణాలతో పునః నిర్మాంచాలన్న సంకల్పంతో నాడు టీడీపీ ప్రభుత్వ హయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థాపన చేశారు. అయితే తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం రివర్స్ టెండర్ల పేరుతో పనులను నిలపుదల చేసింది. జిల్లాలోని క్రీడాకారులు, వాకర్స్ ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్ స్టేడియం పునఃనిర్మాణ పనులను తిరిగి ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకున్నారు. ఎమ్మెల్యే చొరవతో స్పందించిన ప్రభుత్వం రీ టెండర్లను పిలిచి ఆమోదించడం కూడా జరగడంతో పనులు మొదలయ్యాయి. ఈ మేరకు జిల్లా ఉన్నతాధికారులతో కలసి ఎమ్మెల్యే గొండు శంకర్ శనివారం స్టేడియం పనులను పరిశీలించారు. నిధులు మంజూరులో చొరవ చూపిన కేంద్ర, రాష్ట్ర మంత్రులు రామ్మోహన్, అచ్చెన్నాయుడులకు కృతజ్ఞతలు తెలిపారు. పర్యటనలో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి శ్రీధర్, నగర కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.



పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్

రైతులకు కొబ్బరి మొక్కల పంపిణీ



కొబ్బరి మొక్కలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అశోక్

కంచిలి: ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో రిమూవల్ రీప్లాంట్ రిజువేషన్ (ఆర్ అండ్‌ఆర్) పథకంలో భాగంగా స్థానిక ఎమ్మెల్యే బెందాళం అశోక్, జనసేన సమన్వయ కర్త దాసరి రాజు చేతుల మీదుగా పెద్దకొజ్జిరీయ, చిన్నకొజ్జిరీయ గ్రామాల్లో శనివారం రైతులకు కొబ్బరి మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పెద్ద శ్రీరాంపురం, మఖరాంపురం, పెద్దకొజ్జిరీయా, చిన్నకొజ్జిరీయా, దూగాన పుట్టుగ పంచాయతీల పరిధిలో సుమారు 331 హెక్టార్లలో ఈ పథకం అమలు చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఉద్యానశాఖాధికారి మాధవీలత, కూటమి నాయకులు మాదిన రామారావు, బంగారు కురయ్య, జగదీష్ పట్నాయక్, తమరాల శోభన్‌బాబు, బొడ్డ హరిబాబు, బొడ్డ రామ్‌కుమార్, పిలక చినబాబురెడ్డి, పైల రామారావు, డొక్కరి ఈశ్వరరావు, బాలక పవన్, హెచ్ఈవో బాలరాజు, ఎంపీఈవో లలిత, కొబ్బరి రైతులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అశోక్‌కు ఘన సన్మానం

కవిటి: హ్యాట్రిక్ విజయం సాధించిన ఎమ్మెల్యే బెందాళం అశోక్‌కు రాజపురం పంచాయతీ కమలాయిపుట్టుగ గ్రామస్థులు ఘనంగా సన్మానించారు శనివారం గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేను టీడీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం గజమాలలతో సత్కరించారు. జనసేన పార్టీ ఇన్‌చార్జి దాసరి రాజు, టీడీపీ నేతలు మణిచంద్రప్రకాష్, ఎస్వీ రమణ, బి.తిరుమల, సంతోష్ పాల్గొన్నారు.

ముగిసిన కేన్సర్‌పై శిక్షణ



శిక్షణ పూర్తి చేసుకున్న సభ్యులు

అరసవల్లి: హోమీబాబా హాస్పిటల్ పర్యవేక్షణలో కేన్సర్ స్క్రీనింగ్‌పై నెల రోజుల నుంచి జరుగుతున్న శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. గత నెల 13వ తేదీ నుంచి శ్రీకాకుళంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల, టెక్కలి జిల్లా ఆసుపత్రిలో ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలో గల అన్ని సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న గైనకాలజిస్ట్, డెంటల్ సర్జన్లు, జిల్లా బృందం ఈ శిక్షణలో పాల్గొన్నారు. ముందుగానే కేన్సర్ లక్షణాలను గుర్తించి వారికి సరైన సమయంలో వైద్యం అందజేసి కేన్సర్‌ను పూర్తిగా నిర్మూలించడమే ఈ శిక్షణ ముఖ్య ఉద్దేశ్యం. జిల్లాలో గల 151 మంది వైద్యులు, 50 మంది ఏఎన్ఎంలు, 594 మంది సీహెచ్‌వో, 53 మంది అర్బన్ ఏఎన్ఎంలకు మూడు బ్యాచ్‌ల వారీగా, బ్యాచ్‌కు 40 మది చొప్పున జిల్లా ప్రివెంటివ్ అంకాలజీ యూనిట్ నోడల్ అధికారి డాక్టర్ నాగేంద్ర, డీఎంహెచ్‌వో బి.మీనాక్షి, డీసీహెచ్ఎస్ రాజ్యలక్ష్మి, డాక్టర్ సీపీ శ్రీదేవి, డాక్టర్ సుజాత, జిల్లా ఎన్‌సీడీ బృందం సభ్యులు ఆధ్వర్యంలో ఈ శిక్షణ జరిగింది.

పశుగ్రాసంతో రైతులకు ఎంతో మేలు



పశు గ్రాసంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

సరుబుజ్జిలి: పశుగ్రాసంతో రైతులకు ఎంతో మేలు చేకూరుతుందని ఆమదాలవలస పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ ఆర్.ఆనందరావు అన్నారు. శనివారం పశు గ్రాస వారోత్సవాల్లో భాగంగా ఆమదాలవలస మండలం వన్నంపేట, రామచంద్రపురంతో పాటు ఆమదాలవలస మునిసిపాలిటీ బొడ్డేపల్లిపేట, కృషాపురం గ్రామాల్లో పర్యటించి రైతులకు పశు గ్రాసంపై అవగాహన కల్పించారు. రైతులు తనకున్న పొలంలో కొంత విస్తీర్ణంలో పశు గ్రాసాన్ని పెంచుకోవాలన్నారు. అప్పుడు దాణా ఖర్చు తగ్గి పరిశ్రమ లాభసాటిగా ఉంటుందన్నారు. ఈ కార్య క్రమంలో అధికారులు, రైతులు, పశుసంవర్ధకశాఖ పాలిటెక్నికల్ కళాశాల విద్యారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పశువులకు లంపిస్కిన్ నివారణ టీకాలు

సరుబుజ్జిలి మండలంలోని షలంత్రి గ్రామంలో పశువులకు లంపిస్కిన్(ముద్ద) వ్యాధి టీకాలు శనివారం వేసినట్లు పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సీహెచ్.సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ నెల చివరి వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ టీకాలు వేస్తామన్నారు. పాడి రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారి సతీష్‌కుమార్, జేపీఓ పిల్ల పైడిరాజు, పాడి రైతులు పాల్గొన్నారు.

ఘనంగా చౌదరి సత్యనారాయణ జయంతి



సత్యనారాయణ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల: స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ శాసనసభ్యుడు చౌదరి సత్యనారాయణ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. శ్రీకాకుళం సింహ ద్వారం వద్ద చౌదరి సత్యనారాయణ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీడీపీ మాజీ అధ్యక్షుడు చౌదరి నారాయణమూర్తి, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ చౌదరి ధనలక్ష్మి, ఏపీ ఎన్‌జీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చౌదరి పురుషోత్తమనాయుడు, తాండ్ర అరుణ, చౌదరి రవీంద్ర, చౌదరి సతీష్, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు పురస్కారం



విద్యార్థినులకు నగదు, పుస్తకాలు అందజేస్తున్న దృశ్యం

సోంపేట: ఆశ్రమ పాఠశాలలో పదో తరగతిలో మొదటి, ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థినులకు రూ.3వేల చొప్పున ఆర్థిక సాయం శనివారం అందజేశారు. దీనితో పాటు పుస్తకాలు, డైరీ, గొడుగును రోటరీ డిస్ట్రిక్ రీజనల్ పబ్లిక్ ఇమేజ్ చైర్మన్ దుద్ది శ్రీనివాసరావు, మల్లా తిరుమలరావు అందజేశారు. ఈ కార్యక్రమంలో కె.రవికుమార్, సంతు, కుమార్ పాల్గొన్నారు.

నృత్య ప్రదర్శనలో ప్రతిభ



శివకేశవ నృత్య కళానికేతన్ బృందం

ఆమదాలవలస: ఆమదాలవలస పట్టణానికి చెందిన ఓ నృత్య కళా నికేతన్ బృందం విశాఖపట్నంలో జరిగిన నృత్య పోటీల్లో ద్వితీయ స్థానం సాధించింది. విశాఖపట్నానికి చెందిన నాట్య రవళి మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ నిర్వాహకుడు యు.మహేష్ ఆధ్వర్యంలో కళాభారతి కన్వెన్షన్ హాల్లో ఈ నెల 11 నుంచి మూడు రోజుల పాటు 35వ అఖిలభారత నృత్య పోటీలు నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా వందకు పైగా నృత్య బృందాలు పాల్గొన్నాయి. ఆమదాలవలస శివకేశవ నృత్య కళానికేతన్‌కు చెందిన తమ్మన రామదేవస్నీ స్తోత్రతో పాటు పది మంది గ్రూప్ సభ్యులు పాల్గొని ద్వితీయ సాధించినట్లు నిర్వాహకులు భార్గవి, కృష్ణ తెలిపారు.

సాహిత్యంపై యువత పట్టు సాధించాలి



అవధానం జరుగుతున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: తెలుగు భాషా సాహిత్యం, అవధానంపై పట్టుసాధించి ఆదర్శంగా ఉండాలని అవధాని బులుసు అపర్ణ అన్నారు. సుమిత్ర కళాసమితి ఆధ్వర్యంలో నాలుగో రోజు శనివారం ఆరవెల్లి లక్ష్మీనారాయణాచార్యుల వేదికపై జరిగిన అవధానం కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. చదువు ఉంటేనే సంస్కారం వస్తుందని, మాతృభాష తెలుగు భాష ఎంతో గొప్పదని తెలిపారు. గాయత్రి డిగ్రీ కళాశాల విద్యార్థులు అవధాన వర్ణణ ప్రాశ్నికులుగా పాల్గొన్నారు. భారతీయ సంస్కృతి సంప్రదాయాలు, మాదకద్రవ్యాలు నిర్మూలన, మామిడాకుల తోరణాలు, తదితర అంశాలపై వారు అడిగిన వాటికి అవధాని అపర్ణ పద్యరూపం పూరణం చేశారు. పండితులు భాస్కరభట్ల బాలకృష్ణ శర్మ(ఒడిశా), తెలుగు రచయితల వేదిక అధ్యక్షుడు యు.నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ఆర్‌వీ రమణమూర్తి, ఇప్పిలి శంకర్‌శర్మ, పులఖండం శ్రీనివాసరావు, భమిడిపాటి గౌరీశంకర్ శాస్త్రి, మండవల్లి రవిపూజ, గుత్తు చిన్నారావు, వరలక్ష్మి, వీవీఆర్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

వివాహితపై అత్యాచారం కేసులో ఆర్ఎంపీ అరెస్టు

వజ్రపుకొత్తూరు: చికిత్స చేయించుకునేందుకు వచ్చిన వివాహితకు మత్తు మందు ఇచ్చి అత్యాచారానికి పాల్పడిన ఆర్ఎంపీపై రేప్ కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ సీహెచ్ రామారావు తెలిపారు. ఆయన అందించిన వివరాలిలా ఉన్నాయి.. శారాదాపురం గ్రామానికి చెందిన దువ్వాడ ఉమామహేశ్వరరావు ఆర్ఎంపీగా వజ్రపుకొత్తూరులో క్లినిక్ నడుపుతున్నాడు. ఈనెల 9న క్లినిక్‌కు వైద్యం కోసం వచ్చిన ఓ వివాహితకు మత్తుమందు ఇచ్చి అసభ్యకంగా ప్రవర్తించి అత్యాచారానికి పాల్పడ్డాడని తెలిపారు. మత్తువల్ల కేకలు వేయలేక ప్రతిఘటించలేక పోయిందన్నారు. అదేరోజు సాయంత్రం ఇంటికి వచ్చిన భర్తకు జరిగిన ఘటనను తెలిపి రోదించిందన్నారు. భార్యాభర్తలిద్దరూ శనివారం వచ్చి ఫిర్యాదు చేశారన్నారు. ఈ మేరకు కాశీబుగ్గ సీఐ ఈశ్వరరావు, ఎస్ఐ రామారావు క్లినిక్ వద్ద విచారించి ఉమామహేశ్వరరావును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

ఒకేషనల్ విద్యార్థులకు స్పాట్ అడ్మిషన్లు

ఎచ్చెర్ల: ఇంటర్మీడియట్‌లో ఒకేషనల్ గ్రూపు చదివిన విద్యార్థులు పాలిటెక్నిక్ డిప్లమోలో రెండో ఏడాదిలో ప్రవేశానికి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల (శ్రీకాకుళం)లో ఈ నెల 18న స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ జి.దామోదరరావు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఆన్‌లైన్‌లో ప్రొసెసింగ్ ఫీజు చెల్లించి నిర్దేశించిన రోజున ఉదయం 9 గంటలకు ఒరిజనల్ సర్టిఫికేట్లతో హాజరుకావాలన్నారు. ప్రభుత్వ కళాశాలలో సీటు పొందే విద్యార్థులు రూ.4,700, ప్రైవేటు కళాశాలల్లో అయితే రూ.25 వేలు చెల్లించాలన్నారు. కౌన్సెలింగ్‌కు హాజరయ్యే ఓసీ, బీసీ విద్యార్థులు రూ.900, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.500 చెల్లించాలన్నారు.

రాజకీయ వేధింపులు ఆపాలి

గార: శ్రీకూర్మం పంచాయతీ ముద్దాడపేట అంగన్‌వాడీ కార్యకర్తపై రాజకీయ వేధింపులు ఆపాలని సీఐటీయూ నాయకులు అన్నారు. ఈ మేరకు శనివారం ముద్దాడపేటలో నిరసన కార్యక్రమం చేపట్టారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్.అమ్మన్నాయుడు, ఉపాధ్యక్షుడు అల్లు మహాలక్ష్మి, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె.కల్యాణి, డి.సుధ, తదితరులు పాల్గొన్నారు.

ఓపీఎస్‌ను పునరుద్ధరించాలి



జీవోలను తగులబెడుతున్న యూటీఎఫ్ ప్రతినిధులు

సోంపేట: సీపీఎస్ ఉద్యోగులకు జీపీఎస్ అమలు చేస్తూ ప్రభుత్వం రాజపత్రం విడుదల చేయడాన్ని యూటీఎఫ్ ప్రతినిధులు ఖండించారు. ఈ మేరకు పట్టణంలో జీవో పత్రాలను శనివారం తగులబెట్టారు. ఈ జీవోను తక్షణమే రద్దు చేసి పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో లండ బాబూరావు, మురళీ ప్రకాశ్, నల్లాన రవికుమార్, కుమారస్వామి తదితరులు ఉన్నారు.

అలరించిన బాలు స్వర నీరాజనం

శ్రీకాకుళం కల్చరల్: జిల్లా కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బాపూజీ కళామందిర్‌లో శనివారం బాలు స్వర నీరాజనం కార్యక్రమం నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు మిమిక్రీ శివ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో దివ్యాంగులు వివిధ సినిమా పాటలకు నృత్యాలు చేశారు. 100 మంది పేద కళాకారులకు నిత్యావసరాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మిమిక్రీ శివ మాట్లాడుతూ.. పేద కళాకారులకు సేవ చేయడం ఆనందంగా ఉందని, ఇలాంటి కార్యక్రమాలకు తన ప్రోత్సాహం ఎప్పుడూ ఉంటుందని తెలిపారు. దివ్యాంగ కళాకారులను అభినందించారు. మిమిక్రీ కళాకారుడు లోకనాథం నందికేశ్వరరావు, తాడివలస కొండలరావు, గాయకులు కె.ఎల్.ఎస్.మూర్తికి, మజ్జి మోహన్‌రావు, ఆదినారాయణను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు దానేటి శ్రీధర్, నటుకుల మోహన్, బాడాన దేవభూషణ్, డా.సింధూర, డా.బొడ్డేపల్లి సురేష్, రమేష్, వైకుంఠరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ శ్రీధర్